## రూపక నిర్ధారణ

1. తమిళనాడు నందలి ఋతువులు, అవి ఏర్పడు నెలలను పట్టికలో పొందుపరుచుము.

| ఋతువులు | నెలలు |
|---|---|
| వేసవి కాలము (Summer) | |
| శీతా కాలము (Winter) | |
| వసంత కాలము (Spring) | |
| వర్షా కాలము (Rainy) | |

2. మీ పాఠశాల లేక ఇంటి నీడను అనుసరించి కాలమును గుర్తించి గడియారపు కాలముతో పోల్చి చూడము.

3. వేసవి మరియు శీతాకాలములో వచ్చే పండుగలను గుర్తించుము.

4. పూరింపుము.

| ఋతువులు | ఆహారము | దుస్తులు | ముందస్తు చర్యలు |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |

# 1. వేదకాలము

ఆర్యులు మధ్య ఆసియాలోని కైబర్, బోలన్ కనుమల గుండా భారతదేశంలోనికి ప్రవేశించిరి. వీరు పశువులకాపరులై ఉన్నందున పచ్చిక బయళ్ళకొరకు ఒక ప్రాంతము నుండి మరొక ప్రాంతమునకు తరలి వెళ్ళిరి. 4000 సంవత్సరములకు ముందే భారతదేశములోనికి ప్రవేశించిన వీరు ఉత్తర భారతదేశమంతయూ వ్యాపించి స్థిరపడిరి.


భారతదేశములో వీరు స్థిరపడిన ప్రాంతములను "ఆర్యా వర్తము" అనిరి. వీరు జంతువులను పెంచి పోషించి జీవనము చేసిరి. ఆర్యుల నాగరికత "గ్రామీణ నాగరికత". వీరు వీరి పెద్దలు పాడిన పాటలను వేదములుగా రూపొందించిరి. అందువలన ఈ కాలమును వేదకాలము అని అందురు. వేదకాలమును రెండు భాగములుగా విభజించవచ్చును. అవి

1. తొలివేద కాలము   2. మలివేద కాలము

### తొలి వేదకాలము లేక ఋగ్వేద కాలము (క్రీ.పూ. 1500–క్రీ.పూ. 1000)

ఋగ్వేద కాలములో ఆర్యులు ఎక్కువగా సింధు ప్రాంతములో (ప్రస్తుత పాకిస్థాన్) జీవించిరి. వీరు మొదట పంజాబ్‌లోని సప్తసింధు (ఏడు నదుల ప్రదేశము) అనబడు ప్రాంతములో స్థిరపడిరి. ఋగ్వేదము ద్వారా ఆర్యుల సాంఘిక, ఆర్థిక జీవన విధానమును గూర్చి తెలుసుకొనవ

| ఆర్యుల సామాజిక అమరిక |
|---|
| కుటుంబము – గ్రామము – విస్ – జన – జనపదాలు |



## రాజకీయ విధానము

సమాజమునకు మూలము కుటుంబము. అనేక కుటుంబములు కలసి గ్రామము ఏర్పడినది. గ్రామమునకు పెద్ద గ్రామణి. అనేక గ్రామములు కలసి విస్ అను పెద్ద సమూహము ఏర్పడినది. విస్ యొక్క నాయకుడు విశ్వపతి. పెద్ద పరిపాలనా విభాగము జన. దీనికి నాయకుడు రాజన్. పరాక్రమమును, బలమును కలిగిన వాడే రాజు అయ్యెను. రాజ్యములో జీవించిన వారిని ప్రజలు అందురు. రాజును ప్రజాపతి అని పిలిచిరి. రాచరికము వంశపారంపర్యముగా వచ్చెడిది.

తెలుసుకొనుము.

1. నీకు ఇంటి పేరు కలదా?
2. మీ ఇరుగు పొరుగు వారి ఇంటి పేర్లను అడిగి తెలుసుకొనుము.
3. నీవు ఏ దేవుడు/దేవతను పూజించుచున్నావు?

పరిపాలనలో రాజునకు సహాయపడుటకు పురోహితుడు సేనాని ఉండిరి. సభ, సమితి అను రెండు ప్రజాసభలు కూడా ఉండినవి.

సభ – పెద్దల సభ

సమితి – ప్రజా ప్రతినిధులు కలిగిన సభ

### రాజుయొక్క విధులు

- శత్రువుల బారి నుండి తన రాజ్యమును కాపాడుట రాజు యొక్క ముఖ్య విధి.
- రాజు పురోహితుని సలహాల ప్రకారము మత ఆచారములను పాటించెను.
- తన ప్రజలను యుద్ధము, పేదరికము మరియు కరువుల బారి నుండి కాపాడుట రాజుయొక్క బాధ్యత.
- యుద్ధసమయములో రాజు ముందుండి సైన్యమును నడిపించి శత్రువులను ఎదుర్కొనెడివాడు.
- నిందితులను విచారించి న్యాయము చెప్పి శిక్షలను విధించెడివాడు.
- రాజ్య సరిహద్దులను విస్తరించుట, రాజ్యమును పటిష్టము చేయుట రాజుయొక్క విధి.

## సాంఘిక జీవనము

కుటుంబమునకు పెద్ద తండ్రి. పురుషులతో సమానముగా స్త్రీలు విద్యను అభ్యసించిరి. స్త్రీలు సమాజములో జరుగు ఉత్సవములందు స్వేచ్ఛగా పాల్గొనిరి. ఆ కాలములో విశ్వవర, లోపాముద్ర, అపాల, ఘోష వంటి కవయిత్రులు ఉండిరి. జాతి విభేదములు లేవు. ఏకపత్నీవ్రతము, బహు భార్యత్వము అమలులో ఉండెను. వితంతు పునర్వివాహము కూడా ఉండినది.

## ఆర్థిక జీవనము

పశువుల పెంపకము మరియు వ్యవసాయము మొదలైనవి ఋగ్వేద కాలములో ప్రజలయొక్క వృత్తులు. వీరు ఇనుము సహాయముతో అనేక పరికరములు తయారు చేసిరి. వీటి సహాయముతో అడవులు నరికి వ్యవసాయ భూములుగా మార్చిరి. వడ్రంగి పని, నేత పని కూడా చేసెడివారు

వీరు నూలు మరియు ఉన్ని వస్త్రములు ఉత్పత్తి చేసిరి. బంగారు పనివారు (కంసాలి) ఆభరణములు తయారు చేసెడివారు. కుమ్మరి ఇంటికి ఉపయోగపడు కుండలను తయారు చేసెడివారు. వస్తు మార్పిడి విధానము అమలులో ఉండెను. నదులను రవాణాకు ఉపయోగించెడివారు. 'నిష్క' అను బంగారు నాణెములను వ్యాపారమునకు ఉపయోగించెడివారు.

క్రింది వాటియొక్క పుట్టుక మరియు అభివృద్ధిని గురించి తెలపండి.

వడ్రంగి పని, కమ్మరి, బంగారు పని, నేతపని, వ్యవసాయము, పశుపెంపకము, ఆయుధములు తయారు చేయుట.

## ఆహారము

గోధుమ, బార్లీ, పాలు, పెరుగు, నెయ్యి, కాయగూరలు, పండ్లు మరియు మాంసము మొదలైన వాటిని ఆహారముగా భుజించేవారు. సోమ, సుర అను మత్తు పానీయములను సేవించిరి.

## దుస్తులు – ఆభరణములు

ఆర్యులు నూలు మరియు ఉన్నితో తయారుచేసిన దుస్తులు ఉపయోగించిరి. పురుషులు పంచె, శాలువ మరియు తలపాగాను ధరించిరి. పై వస్త్రము మరియు నడుముకు కట్టు వస్త్రమును స్త్రీలు ధరించిరి. స్త్రీ పురుషులు ఇరువురు, చెవి దుద్దులు, కంఠాభరణములు, గాజులు, తలాభరణములాంటి వాటిని ధరించిరి.

## మతము

ఆర్యులు అగ్ని, వాయువు, సూర్యుడు, ఆకాశము మరియు వృక్షములు మొదలైన ప్రకృతి శక్తులను పూజించిరి. ఇంద్రుడు, వరుణుడు, అగ్ని, యముడు మొదలైన దేవతలను కూడా ఆరాధించిరి. ఆ కాలములో దేవతలకు సంబంధించిన విగ్రహములు గాని దేవాలయములుగాని లేవు. వీరు యాగములు, మతాచారములను పాటించిరి. మత సిద్ధాంతములను వివరముగా వ్రాసిరి. వీరు యజ్ఞయాగాదులు జరుపు సమయమున పాలు, నెయ్యి, ధాన్యములను సమర్పించేవారు. పూజాసమయములో అశ్వమేధ, రాజసూయ, వాజపేయ యాగములను చేసెడివారు.

## మలి వేదకాలము (క్రీ.పూ. 1000 – క్రీ.పూ 600)

ఋగ్వేద కాలము తరువాత యజుర్వేద, సామవేద, అధర్వణ వేదకాలములను మలి వేదకాలము అందురు. ఈకాలములో ఆర్యులు తూర్పు వైపుకు విస్తరించిరి.(తొలి వేదకాలపు ఆర్యులు కాబూల్ నుండి గంగానది వరకు విస్తరించిరి.) ఈ కాలములో రాజ్యములు విస్తరించినవి. బ్రాహ్మణములు, ఉపనిషత్తులు, అరణ్యకములు మొదలగు వాని భావములు వివరించి వ్రాయబడినవి.

## రాజకీయము విధానము

ఈ కాలములో ఆర్యావర్తమని పిలువబడే సింధులోయ ప్రాంతము ముఖ్యమైన పరిపాలనా కేంద్రము. కోసల, విదేహ, కురు, మగధ, కాశి, అవంతి మరియు పాంచాల రాజ్యములు కలిసిపోయినవి. రాచరికము వంశపారంపర్యమయ్యెను. శత్రువుల నుండి రాజ్యమును రక్షించుట, శాంతి భద్రతలు కాపాడుట రాజు యొక్క ముఖ్య విధి. రాజ్యము విస్తరించబడినందు వలన రాజు యొక్క బాధ్యతలు అధిక మయ్యెను. రాజు తన ఏకచత్రాధిపత్యమును నిలుపుకొనుటకు అశ్వమేధ, రాజసూయ మరియు వాజపేయ యాగములు, నిర్వహించెడివాడు. సభ మరియు సమితి పతనమైనవి.

## ఆర్థిక వ్యవస్థ

వీరు ఇనుప లోహమును విరివిగా ఉపయోగించిరి. దీని వలన చేతివృత్తులు బాగా అభివృద్ధి చెందినవి. వీరు వరి, చెఱకు, గోధుమ మరియు బార్లీలను పండించేవారు. ఆవు పేడను ఎరువుగా ఉపయోగించిరి, పశుసంపద బాగా అభివృద్ధి చెందెను. పశువుల సంఖ్యను బట్టి వీరికి సమాజములో ఉన్నత స్థానము ఇవ్వబడినది. నేత పనివారు, చర్మకారులు, కమ్మరులు, వడ్రంగులు బంగారు పని వారు సమాజములో నుండిరి.నిష్క,స్వర్ణ శతమాన మున్నగు బంగారు మరియు వెండి నాణెములు అమలులో ఉండినవి.



ఆర్యుల కాలమునాటి విరిగిన కుండ గుర్తులు

## సాంఘిక జీవనము

ఈ కాలములో కుల వ్యవస్థ కఠినతరమయ్యెను. దీనిని వర్ణధర్మము అని పిలిచిరి. యాగములు మరియు పౌరోహిత్యము చేయువారిని బ్రాహ్మణులు అని పిలిచిరి. యుద్ధము చేసి రాజ్యమును కాపాడువారిని క్షత్రియులు అని పిలిచిరి. వ్యాపారులు మరియు వ్యవసాయదారులను వైశ్యులు అని పిలిచిరి. ఈ మూడు వర్గములవారికి బానిసలుగా పనిచేయువారిని శూద్రులు అని పిలిచేవారు.

## స్త్రీలయొక్క స్థానము

మలివేద కాలములో స్త్రీలకు ప్రాముఖ్యత తగ్గెను. వీరు పురుషుల కంటే తక్కువ స్థానములో ఉండిరి. వీరు ఆస్తిలో హక్కును, పరిపాలనా హక్కును కోల్పోయిరి. బాల్యవివాహములు సర్వసాధారణమయ్యెను. రాజ కుటుంబమునకు చెందిన స్త్రీలకు మాత్రము కొన్ని అధికారములు ఇవ్వబడినవి. సతీసహగమనము అమలులో ఉండెను. భర్త చనిపోయిన స్త్రీ భర్తతో పాటు సజీవ దహనము చేయు ఆచారము ఉండెను.

## విద్య :

ఆర్య ధర్మము ప్రకారము బ్రాహ్మణ విద్యార్థులు తమ గురువులతో పాటు గురుకులములో నివసించి విద్యనభ్యసించెడి వారు. విద్యార్థులు తత్వశాస్త్రము, తర్కము, మతము, వ్యాకరణము, జ్యోతిష్య శాస్త్రము, వైద్యశాస్త్రము, క్రమశిక్షణ, గణితము, వేదములు మరియు ఉపనిషత్తులను అభ్యసించిరి. రాకుమారులకు మాత్రము ధనుర్వేదము (యుద్ధ తంత్రము) నేర్పబడెను. ఈ కాలములో గార్గి, మైత్రేయి వంటి స్త్రీలు గొప్ప విద్యావంతులుగా ఉండిరి.

## మతము

మలి వేదకాలములో బ్రాహ్మణులలోని వర్ణధర్మము వలన మతములో అనేక మార్పులు వచ్చెను. తొలివేద కాలములో పూజించిన దేవతల ప్రాముఖ్యత తగ్గెను. ఈ కాలములో బ్రహ్మ, విష్ణు, రుద్ర (శివ) దైవములకు ప్రాముఖ్యత ఇవ్వబడినది. పూజా విధానములో యాగములు, సాంప్రదాయములు అధికమయ్యెను. జంతు బలులు అధికమయ్యెను. ప్రజలు ఆత్మ, విధి, మోక్షములను నమ్మిరి. మలి వేద కాలము చివరిలో పురోహితుని ఆధికృత తగ్గి సాంప్రదాయములు, బలులను వ్యతిరేకించిరి. ఈ కాలములోనే సమాజములోని అర్థములేని సాంప్రదాయములు మరియు విలువైన ప్రాణ బలులను వ్యతిరేకించిన జైన, బౌద్ధమతములు ఆవిర్భవించినవి.

# ద్రావిడ, ఆర్య నాగరికతల లక్షణములు

| వ.సంఖ్య | ద్రావిడ నాగరికత లక్షణములు | ఆర్య నాగరికత లక్షణములు |
|---|---|---|
| 1. | నల్లటి రంగు, మితమైన పొడవు, నల్లటి పొడవైన వెంట్రుకలు కలవారు. | అందమైన, పొడవైన, గోధుమ రంగు వెంట్రుకలు కలవారు. |
| 2. | ముఖ్యవృత్తి, వ్యాపారము మరియు వ్యవసాయము | ముఖ్యవృత్తి పశువులపెంపకము, యుద్ధము |
| 3. | ప్రత్తితో తయారు చేయబడిన వస్త్రములను ధరించిరి. | ఉన్ని, ప్రత్తి, మరియు జంతువుల చర్మములతో చేయబడిన వస్త్రములను ధరించిరి. |
| 4. | వీరి కాలములో ముఖ్య జంతువు ఎద్దు. ఎద్దును పూజించిరి. | ముఖ్యమైన జంతువు ఆవు. ఆవును పూజించిరి. |
| 5. | కాల్చిన ఇటుకలతో ఇంటిని నిర్మించిరి | వెదురు, బంకమట్టి సహాయముతో గృహనిర్మాణము చేసేవారు. |
| 6. | విగ్రహములు, లింగము, శూలము,శక్తి మరియు పామును పూజించిరి. | విగ్రహారాధన లేదు. దేవాలయములు లేవు. ప్రకృతిని పూజించిరి. యజ్ఞములు, సంప్రదాయములు పాటించిరి. |
| 7. | వీరు రాగిని ఉపయోగించిరి. ఇనుము యొక్క ఉపయోగము వీరికి తెలియదు. | ఇనుము ఉపయోగించిరి. |
| 8 | పులిని గూర్చి తెలియును,కాని గుఱ్ఱము తెలియదు. | పులిని గూర్చి తెలియదు. గుఱ్ఱమును ఉపయోగించిరి. |
| 9. | వ్యవసాయ నాగరికత , నగరములు | పశుపోషణ నాగరికత, గ్రామములు. |

# మూల్యాంకనము

## I. సరియైన సమాధానము ఎన్నుకొనుము.

1. ఋగ్వేద కాలము
   ఎ) క్రీ. పూ. 1600 – క్రీ. పూ 1000 బి) క్రీ. పూ. 1000 – క్రీ. పూ 600
   సి) క్రీ. పూ. 1500 – క్రీ. పూ 1000
2. ఋగ్వేద కాలమున వ్యాపారములో ఉపయోగించబడిన నాణెము
   ఎ) నిష్క బి) రూపాయి సి) డాలర్
3. మలి వేదకాలములో విద్యా రంగములో ప్రసిద్ధిచెందిన స్త్రీ
   ఎ) గార్గి బి) అబెల్ల సి) కోశ

## II. ఖాళీలను పూర్తి చేయుము.

1. గ్రామమునకు పెద్ద ____________
2. తొలి వేదకాలములో వితంతువుకు ____________ ఆచారము ఉండెను.
3. ప్రజా ప్రతినిధులు కల్గిన సభ ____________
4. భర్త చనిపోయిన స్త్రీ, భర్తతో పాటు ____________ చేయబడెను.

## III. తప్పు లేక ఒప్పు

1. ఏడు నదులు ప్రవహించు ప్రాంతమును సప్తసింధు అనిరి.
2. సైన్యాధ్యక్షుని సేనాని అని పిలిచిరి.
3. వితంతు పునర్వివాహము ఋగ్వేద కాలములో అనుమతించబడలేదు.
4. సమాజమునకు కుటుంబము పునాదివంటిది.
5. ద్రావిడులకు పులి అను జంతువు గురించి తెలియదు.

## IV. జతపరచుము

| | | |
|---|---|---|
| 1. శతమాన | – | శివుడు |
| 2. ప్రజలు | – | రాజన్ |
| 3. రుద్ర | – | విశ్వపతి |
| 4. జన నాయకుడు | – | నాణెము |
| 5. విస్ నాయకుడు | – | పౌరులు |

## V. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయుము.

1. ఋగ్వేద కాలపు ప్రజలు ధరించిన ఆభరణములను వ్రాయుము.
2. మలి వేదకాలములో బ్రాహ్మణ విద్యార్థులు ఏయే విద్యలను అభ్యసించే వారు?
3. ఆర్య, ద్రావిడ నాగరికత మధ్య పోలికలు మరియు తారతమ్యములు వ్రాయుము.

## రూపక నిర్ధారణ

1. ఇంటర్‌నెట్ నందు శోధించుము.
   i. కైబర్ మరియు బోలన్ కనుమలు.
   ii. భారతదేశ చరిత్రలో వాటి పాత్రను తెలుసుకొనుము.
2. వివిధ రకముల నాణెములను సేకరించి వాటికి సంబంధించిన సమాచారమును పట్టికనందు పొందుపరుచుము.
3. వేదకాల స్త్రీల పరిస్థితులతో ప్రస్తుతకాల స్త్రీల పరిస్థితులను పోల్చిచూడుము.
4. భారతదేశ పటమునందు ఆర్యుల రాక మార్గమును సూచించి క్రింది ప్రాంతములను గుర్తించుము.

| | | | |
|---|---|---|---|
| I. | కాలిభంగన్ | v. | రాజగృహ |
| ii. | మొహంజోదారో | vi. | వైశాలి |
| iii. | లోథల్ | vii. | మధుర |
| iv. | ఉజ్జయిని | viii. | హస్తినాపురం |

# 2. జైన, బౌద్ధ మతములు

క్రీ.పూ. 6 వ శతాబ్దములో ప్రపంచములో అనేక ప్రాంతములలో మత విప్లవములు ప్రారంభమైనవి. ఈ కాలములో భారతదేశములో జైన బౌద్ధమతములు ఆవిర్భవించినవి. ఈ రెండు మతములు సమాజములోని దురాచారములను సంస్కరించుటకు ఏర్పడినవి. ఈ మతముల ముఖ్య ఉద్దేశ్యము ఏమనగా సమాజములోని మూఢ నమ్మకములు, మత దురాచారములు, కులవ్యవస్థలోని అసమానత్వమును తొలగించుట. జైనమతమును వర్ధమాన మహావీరుడు స్థాపించెను. బౌద్ధమతమును గౌతమబుద్ధుడు స్థాపించెను.

## జైనమతము

జైన మతములో 24 మంది తీర్థంకరులు పూజింపబడిరి. ఆదినాదర్ అనబడు ఋషభదేవుడు మొదటి తీర్థంకరుడు. వర్ధమాన మహావీరుడు (24వ తీర్థంకరుడు) చివరివాడు. ఇతడు జైనమతమునకు దృఢమైన పునాది వేసెను.

వర్ధమాన మహావీరుడు క్రీ.పూ. 534 నుండి క్రీ.పూ 462 మధ్య జీవించియుండెను. ఇతడు వైశాలీ నగరమునకు సమీపమున గల కుంతల గ్రామమున జన్మించెను. ఇది ప్రస్తుతము బీహార్ నందు కలదు. ఇతని తండ్రి సిద్ధార్థుడు, తల్లి త్రిశాల. వర్ధమానునికి యశోద అను భార్య, అనోజ ప్రియదర్శిని అనుబడు కుమార్తె ఉండేవారు. ఇతడు తన 30వ ఏట కుటుంబ జీవితమును వదలి సన్యాస జీవితమును చేపట్టెను. సత్యాన్వేషణకొరకు 12 సంవత్సరములు అనేక ప్రదేశములు తిరిగి కఠినమైన తపస్సు చేసెను. తన జీవితంలో సుఖదు:ఖములను సమానముగా భావించెను. సత్యమును వెతికి దానిని జయించెను. అందుకే అతనిని 'జినుడు' అనిపిలిచిరి. జినుడు అనగా జయించిన వాడు అని అర్థము. ప్రజలు ఇతనిని మహావీరుడు అని కూడ పిలిచిరి. ఇతడు 30 సంవత్సరములు అనేక ప్రదేశములకు వెళ్ళి జైనమత సిద్ధాంతములను బోధించెను.



వర్ధమాన మహావీరుడు


మానవులు ఎందుకు జన్మించుచున్నారు? వీరు ఎందుకు మరణించుచున్నారు. వీరి దు:ఖములకు మూలకారణములు ఏవి? ఇటువంటి ప్రశ్నలు తన మనస్సున కలిగెను. ప్రజలు ఒకరినొకరు ఎందుకు కష్టపెట్టవలయును? ఎందుకు హింసము చేయవలయును? అనే ఆలోచనలు తన మనస్సులో కలిగినవి. ఒక వేళ పూర్వజన్మములో చేసిన పాపములు అయి ఉండవచ్చునని ఒక తెగవారు వాదించగా అందుకు మహావీరుడు అంగీకరించలేదు. మానవ జన్మలో పాపము చేయకుండుట ఎట్లని ఆలోచించెను. కావున మానవులు ఇతరులను హింసించరాదు. మానవుని దు:ఖమునకు మానవులే కారణము అని భావించెను.

జీవహింస చేయరాదని వర్ధమానుడు బోధించెను. అతని శిష్యులకు కూడా అహింసా సిద్ధాంతములు పాటించమని బోధించెను. దైవత్వము పొందగోరు జైనులు శరీర సుఖములను అదుపులో ఉంచుకొనవలెను. మనస్సును కట్టడి చేయవలయును. జైనమతము జీవరాసులను హింసించరాదని నొక్కి చెప్పెను. జైనులు వస్త్రములను త్యజించిరి. వ్యవసాయం చేయుట, యుద్ధములు చేయుటను జైనమతము వ్యతిరేకించినది. వర్తకము మరియు వాణిజ్యము వారి ముఖ్య వృత్తి. కట్టుదిట్టమైన జీవనాన్ని కొనసాగించవలెనని జైనమతము బోధించెను.

## త్రిరత్నములు లేక మూడు రత్నములు

- సరియైన జ్ఞానము
- సరియైన విశ్వాసము
- సరియైన ప్రవర్తన

## ఐదు సిద్ధాంతాలు



1. అహింస (హింసచేయకుండుట)
2. సత్యము (నిజమునే పలుకుట)
3. ఆస్తేయము (దొంగతనము చేయరాదు)
4. త్యాగము (ఆస్తిని కలిగి ఉండరాదు)
5. బ్రహ్మచర్యము (వివాహమాడకుండుట)

## మహావీరుని సిద్ధాంతములు

సమాజములో సాంఘిక దురాచారములు మూఢనమ్మకములు, కొట్లాటలు, యుద్ధములు కొనసాగుతున్న కాలంలో మహావీరుని సిద్ధాంతములు వేగముగా వ్యాప్తి చెందినవి.

### జైనమత సిద్ధాంతములను అనుసరించిన రాజులు

| | |
|---|---|
| చంద్రగుప్త మౌర్యుడు | – మౌర్యరాజు |
| ఖారవేలుడు | – కళింగరాజు |
| కూన్ పాండియన్ | – పాండ్యరాజు |
| మహేంద్రవర్మన్ –1 | – పల్లవ రాజు |

## తమిళ సాహిత్యమునకు జైనులు చేసిన సేవ

జైనులు శిలప్పదికారమ్, జీవకచింతామణి, వల్లయాపధి, చూళామణి మొదలగు ఇతిహాసములు, యసూప్పెరుంకులకారిగై, యాప్పెరుంకలవిరుత్తి, నేమినాథమ్, నన్నూల్, అగప్పొరుల్‌విలక్కుం, తమిళ నిఘంటువు మొదలైన సాహిత్య గ్రంథములు మరియు నాలడియార్, నాన్ మణిక్కడిగై, పళమొళి, తినైమాలై నూట్రియంబదు మొదలగు గ్రంథములను రచించి తమిళ సాహిత్యమునకు సేవ చేసిరి.

### భవన నిర్మాణమునకు జైనులు చేసినసేవ

రాజస్తాన్–'మౌంట్–అబూ' లోని దిల్వారా జైన దేవాలయము, ఖజురహో, చిత్తోర్, రణక్‌పూర్‌లలోని జైన దేవాలయములు.



దిల్వారా జైన దేవాలయము

"కొల్లాన్ పుల్లాలై మరుత్తానై కైకోపి ఎల్లా వుయిరుం తోయుమ్" – 'తిరువళ్ళువర్'



**శిల్పము**
- ఉదయగిరి
- హతిగూంఫా
- గిర్నార్
- శ్రావణబెళగొళ
- కళుగుమలై

కర్ణాటకలోని శ్రావణ బెళగొళ వద్దగల గోమతేశ్వరుని విగ్రహము

## బౌద్ధమతము

బౌద్ధమతమును స్థాపించిన వారు గౌతమబుద్ధుడు. ఇతని అసలుపేరు సిద్ధార్థుడు. అతడు క్రీ.పూ. 563 మరియు క్రీ.పూ. 483 సంవత్సరముల మధ్య జీవించి యుండెను. ఇతడు నేపాల్ లోని కపిలవస్తు నగరములో జన్మించెను. ఇతని తండ్రి శుద్ధోదనుడు శాక్య వంశమునకు చెందినవాడు. సిద్ధార్థుడు జన్మించిన ఏడవరోజునే తల్లి మాయాదేవిని కోల్పోయెను. కావున సవతితల్లి సిద్ధార్థుని పెంచి పెద్దచేసెను. ఇతడు తన16వ సంవత్సరములో యశోదర అను ఆమెను వివాహమాడెను.వీరికి రాహులుడు అను కుమారుడు జన్మించెను.

ఇతడు తన చిన్నతనము నుండే ప్రపంచములో జరుగు విషయములపై ఆసక్తి చూపించెను. వేటాడుట మరియు ఆడంబరమైన జీవితము గడుపుటకు ఇతడు ఆసక్తి చూపలేదు. సమాజములో అట్టడుగు వర్గమువారి పేదరికము ఇతనిని అధికముగా బాధించినది.



బుద్ధుడు

ఇతని మనస్సులో ధనవంతులు అనుభవించు విలాసవంతమైన జీవితము మరియు పేదవారు, రోగులు, వృద్ధులు అనుభవించు బాధాకరమైన జీవితము వంటి అనేక ప్రశ్నలు రేకెత్తినవి. తరువాత ఇతడు తన భార్య, కుమారుని వదలి సన్యాస జీవితమును చేపట్టెను. ఆకలి దప్పికలు వదలిపెట్టినప్పటికి అతని ప్రశ్నలకు సమాధానం దొరకలేదు. కావున అతడు తనను తాను హింసించుకొనుట ఆపి ఆహారము భుజించెను. సత్యాన్వేషణ కొరకు దీర్ఘముగా ఆలోచించుట మొదలుపెట్టెను. అతడు గయ నగరము నందు ఒక బోధి వృక్షము క్రింద ధ్యానము చేసి జ్ఞానము పొందెను. బుద్ధుడు బెనారస్ సమీపములో గల సారనాథ్ లోని జింకల వనము వద్ద తన మొదటి సందేశము ఇచ్చెను.

గయలోని బోధి వృక్షము క్రింద జ్ఞానోదయము పొందిన సిద్ధార్థుడు బుద్ధుడు అయ్యెను. బుద్ధుడు అనగా మంచి, చెడు మరియు బాధలను గురించి తెలుసుకున్న వాడు అని అర్థము.

### బుద్ధుని సిద్ధాంతములు

జీవితం దు:ఖమయము, దు:ఖములకు విధి లేక పూర్వజన్మలో చేసిన పాపములు కారణము కాదు. కోరికలను తొలగించిన దు:ఖము అంతమగును. వీటిని జయించుటకు అత్యాస విడనాడుట, అపద్దమాడకుండుట, ఇతరులను హింసించకుండుట పాటించవలెను మరియు సరియైన ఆలోచన, సరియైన వాక్కు, సరియైన జీవన విధానమును కలిగియుండవలెను. వర్ణ విభేదము తొలగించుటకు ప్రయత్నించెను. మానవుడు భగవంతుడు, ఆత్మ మరియు విధిని గురించి భయపడవలసిన పనిలేదని చెప్పెను. మానవులు వారివారి సొంత ఆలోచనలు మరియు జ్ఞానముపై ఆధారపడి జీవించవలెను. తోటి మానవులు, జంతువులు మరియు పక్షులపై భూతదయ కల్గియుండవలెనని చెప్పెను.

బుద్ధుడు బాధలను గురించి నాలుగు సత్యములు మరియు నడవడిక గురించి అష్టాంగమార్గమును బోధించెను.

### బుద్ధుని నాలుగు సత్యములు

(1) జీవితము దు:ఖమయము
(2) కోరికలు దు:ఖమునకు మూలము
(3) కోరికలను త్యజించినచో దు:ఖము అంతమగును
(4) దు:ఖమును అంతము చేయుటకు అష్టాంగ మార్గము అనుసరించవలెను.

| మహాయానము | హీన యానము |
|---|---|
| బుద్ధుని దేవునిగా పూజించిరి. విగ్రహారాధన ఇష్టపడిరి. | బుద్ధుని సిద్ధాంతములు అంగీకరించిరి. విగ్రహారాధన వ్యతిరేకించిరి. |

### అష్టాంగ మార్గము


| | |
|---|---|
| సరియైన నమ్మకము | సరియైన జీవితము |
| సరియైన ప్రయత్నము | సరియైన పని |
| సరియైన వాక్కు | సరియైన జ్ఞానము |
| సరియైన దృష్టి | సరియైన ధ్యానము |

బుద్ధుడు తన బోధనలు వ్యాప్తి చేయుటకొరకు అనేక ప్రాంతములకు వెళ్ళెను. అచ్చట తన ఆలోచనలు అనేక వర్గముల వారితో పంచుకొనెను. బౌద్ధసన్యాసులు ఇతని బోధనలు వ్యాప్తి చేయుటకు ముందుకు వచ్చిరి. బౌద్ధ సన్యాసులచే ఏర్పడిన సంస్థలను సంఘం అని పిలిచిరి.

సమాజములో బాధలకు గురియైన వ్యవసాయ దారులు, బీదవారు, స్త్రీలు, కూలీలు మొదలైనవారు బుద్ధుని సిద్ధాంతములను అంగీకరించిరి. అందరూ సమానులు అన్న బోధనచే ప్రజలు బాగా ఆకర్షించబడిరి. అందువలన బౌద్ధమతము బాగా వ్యాప్తి చెందెను.

అనేక మంది రాజులు జైనమతము వలె బౌద్ధమతముచే ఆకర్షింపబడిరి. వీరిలో ప్రముఖమైన చక్రవర్తి అశోకుడు. క్రీ.శ. 6 వ శతాబ్దము తరువాత హిందూమత పునర్వికాసము వలన జైన బౌద్ధమతములు క్షీణించనవి. బౌద్ధమతము హీనయానము, మహాయానము అను రెండు శాఖలుగా చీలిపోయినవి.

### కళ మరియు వాస్తు శిల్పము





సాంచి స్థూపము

నేటికిని బౌద్ధమతము శ్రీలంక, బర్మా, టిబెట్, చైనా, జపాన్ మరియు థాయిలాండ్ దేశములలో అనసరించబడుచున్నవి.
బౌద్ధమతమును అనుసరించిన రాజులు – అశోకుడు, కనిష్కుడు మరియు హర్షవర్ధనుడు.

### తెలుసుకొనుము

- మన జాతీయ చిహ్నము (నాలుగు తలల సింహము గుర్తు) అశోకుని శిలాస్తంభము నుండి గ్రహింపబడినది
- మనజాతీయ జెండాలోని 24 ఆకులు అశోకుని స్తంభములోని ధర్మచక్రములోనివి.
- బీహారులో బుద్ధుని విహారములు ఎక్కువగా కలవు.

### చారిత్రక చిహ్నములు

- బుద్ధుని జాతక కథలు బౌద్ధమతమును గూర్చి వర్ణించుచున్నది. జాతక కథలు గయ, సాంచి మరియు బార్హుట్ మొదలైన ప్రాంతములలో వివరముగా వర్ణించబడినవి.

- మహారాష్ట్రలో ఔరంగబాద్‌లో గల అజంతా ఎల్లోరా గుహలలోని చిత్రకళ బుద్ధుని గొప్పతనమును గూర్చి వివరించుచున్నది. గాంధార శిల్పకళ బౌద్ధమతమునకు చెందినది.

- బౌద్ధ సన్యాసుల ప్రార్థనా స్థలములను 'చైత్యములు' అనియు వారి మఠములను 'విహారములు' అనియు అందురు.

### సాహిత్యము

- బౌద్ధమత గ్రంథమును 'త్రిపీటకములు' అని అందురు.
  1) శుద్ద పీటకము 2) వినయ పీటకము
  3) అభిదమ్మ పీటకము
- మణిమేఘలై, కుండలకేసి మొదలైనవి బౌద్ధ సాహిత్య గ్రంథములు.

జైన సన్యాసులు రచించిన గ్రంథములు.

- శిలప్పదికారం, నన్నూల్ (వ్యాకరణము)
- జీవకచింతామణి, వల్లయాపథి (సాహిత్యము)
- అంగములు మరియు పూర్వాంగములు
  (జైనమత గ్రంథములు)

### తెలుసుకొనుము.

- శ్రీలంకకు చెందిన 'మహావంశము' అను గ్రంథము వట్టక్కామిని అభయన్ అను రాజు కాలములో త్రిపీటకములు వ్రాయబడినవి అని తెలుపుచున్నది. పాళీ భాషలో త్రిపీటకములనగా మూడు బుట్టలని అర్థము.

> సక్రమముగా నిర్మించిన గృహములోనికి నీరు ప్రవేశించలేవు. అదే విధముగా మంచి ఆలోచనజ్ఞానము కలిగిన వారి హృదయము లోనికి దురాలోచనలు ప్రవేశించలేవు.
>
> – బుద్ధుడు

## మూల్యాంకనము

I. సరియైన సమాధానమును గుర్తించుము.

1. జైనమతమునకు దృఢమైన పునాది వేసినవాడు
   ఎ) వర్ధమాన మహావీరుడు బి) ఆదినాదర్ సి) గౌతమ బుద్ధుడు
2. జైన మతముచే నొక్కి చెప్పబడిన సిద్ధాంతములు
   ఎ) విగ్రహారాధన బి) జీవహింస చేయకుండుట సి) అంటరానితనము

3. తమిళనాడులో జైన శిల్పకళ కనిపించు ప్రాంతములు

ఎ) గిర్నార్ బి) కళుగుమలై సి) హతిగూంపా

4. బుద్ధుడు జ్ఞానోదయము పొందిన స్థలము.

ఎ) కుంతల గ్రామము బి) జింకల వనము సి) గయ

5. బౌద్ధమతమును స్వీకరించిన రాజులలో ముఖ్యమైన రాజు

ఎ) చంద్ర గుప్తుడు బి) అశోకుడు సి) బిందుసారుడు

## II. క్రింది ఖాళీలను పూరించండి.

1. జయించినవాడు , జినుడు అని పిలువబడినవాడు ____________________.
2. జైనమతము నొక్కి చెప్పిన సిద్ధాంతములను ____________________ అందురు.
3. ____________________ లో గోమతేశ్వరవిగ్రహము కలదు.
4. బుద్ధుని సిద్ధాంతములు ____________________అని పిలువబడుచున్నవి.
5. బౌద్ధసన్యాసుల సంస్థలను ____________________ అందురు.
6. మన జాతీయ జెండాలోని ధర్మచక్రము ____________________ స్తంభము నుండి స్వీకరించబడినది.

## III. తప్పు లేక ఒప్పు

1. మైసూరులో గోమతేశ్వరుని విగ్రహము కలదు.
2. బుద్ధుని కుమారుడు రాహులుడు.
3. జైనమత స్థాపకుడు బుద్ధుడు.
4. మహావీరుడు 24 వ తీర్థంకరుడు.
5. అశోక చక్రములో 24 ఆకులు కలవు.

## IV. జతపరచుము.

| | |
|---|---|
| 1. త్రిపీటకములు | – బుద్ధుని దైవముగా ఆరాధించిరి |
| 2 హీనయానము | – బుద్ధుని మొదటి సందేశము |
| 3. శిలప్పదికారమ్ | – బుద్ధుని సిద్ధాంతములు పాటించిన వారు |
| 4. జింకల వనము | – జైన సాహిత్యములు |
| 5. మహాయానము | – బౌద్ధమత గ్రంథము |

## V. ఐదు పంక్తులలో సమాధానము వ్రాయుము.

1. జైన, బౌద్ధ మతముల ఆవిర్భావమునకు కారణాలేవి?
2. జైన మతము ప్రబోధించిన త్రిరత్నములను గురించి వ్రాయుము.
3. తమిళ సాహిత్యమునకు జైనులు చేసిన సేవలను గురించి వ్రాయుము.
4. బుద్ధుని నాలుగు సత్యములేవి?
5. కోర్కెలను అణచుటకు బుద్ధుడు ప్రవచించిన అష్టాంగమార్గమును గురించి వ్రాయుము.

## VI. విపులముగా జవాబులిమ్ము

1. జైనమత ముఖ్య సిద్ధాంతములను గురించి వ్రాయుము.
2. బౌద్ధమతములో నీకు నచ్చిన అంశములేవి?

## రూపక నిర్ధారణ

1. జైన, బౌద్ధ మతములలోని సిద్ధాంతములలో వేటిని నీవు అనుసరించుటకు ఇష్టపడెదవు? ఈ సిద్ధాంతములను అనుసరించినపుడు ఎటువంటి మంచి మార్పులు కలిగినవి? ఆలోచించి వివరింపుము.
2. భారతదేశములో ఆవిర్భవించిన జైన మరియు బౌద్ధ మతములు ప్రస్తుతము కేవలం విదేశాలలోనే అనుసరించబడుచున్నవి. కారణములను విశ్లేషించుము.
3. అజంతా మరియు ఎల్లోరా యొక్క విశిష్టతను తెలుసుకొనుము లేక గ్రంథాలయమునకు వెళ్ళి పుస్తకముల ద్వారా వీటి ప్రత్యేకతను తెలుసుకొనుము.
4. భారతదేశ పటమునందు క్రింద పేర్కొన్న ప్రాంతములను గుర్తించుము.

   i. శ్రావణ బెళగొళ

   ii. వైశాలి

   iii. మౌంట్ అబు

   iv. కపిలవస్తు

   v. సాంచి

   vi. గయ

   vii. అజంతా మరియు ఎల్లోరా